



RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 277 గురువారం 31 అక్టోబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## దేశానికి ఆదర్శంగా
# కులగణన

**ప్రజల స్థితిగతులపై మెగా హెల్త్‌చెకప్ లాంటిది**
**దీనిపై 33 జిల్లాలకు పార్టీ పరిశీలకులను నియమించాలి**
**నవంబరు 30లోగా పూర్తిచేసి.. స్థానిక పోరుకు వెళ్దాం**
**పార్టీకి నష్టం కలిగించేలా ఎవరైనా మాట్లాడితే సహించం**
**గాంధీ కుటుంబం మాటంటే మాటే**
**పీసీసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): కులగణన సర్వేను నవంబరు 30లోగా పూర్తి చేసి.. స్థానిక ఎన్నికలకు సిద్ధమవుదామని కాంగ్రెస్ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సర్వేపై పార్టీ నేతలకు అవగాహన కల్పించడానికి బుధవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కులగణన అనేది ప్రజల జీవన స్థితిగతులపై ఎక్స్‌రే మాత్రమే కాదని, అది మెగా హెల్త్‌చెకప్ లాంటిదని సీఎం అన్నారు.



ప్రభుత్వ ఆదాయాన్ని సామాజికన్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని తెలిపారు. 'కులగణన సర్వేపై సమన్వయం కోసం పార్టీ తరఫున 33 జిల్లాలకు 33 మంది పరిశీలకులను పీసీసీ నియమించాలని సూచిస్తున్నాను. పార్టీ నేతలంతా బాధ్యతగా పనిచేయాలి. మీ కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుంది. కులగణనపై రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించదు. పార్టీకి నష్టం కలిగించేలా ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోం. దేశానికి తెలంగాణ ఒక మోడల్‌గా మారేలా సర్వేను ముందుకు తీసుకెళ్లాలి. తెలంగాణ మోడల్ రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేలా ఉంటుంది. ఇక్కడి నుంచే నరేంద్రమోదీపై యుద్ధం ప్రకటించాలి. **మిగతాది 2లో...**

## ప్రభుత్వ ఉద్యోగులకు
# దీపావళి కానుక

**డీఏ పెంపునకు ఉత్తర్వులు జారీ**



హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): దీపావళి పండుగ సందర్భంగా ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 3.64 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏ పెంపు 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని తెలిపింది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

# స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు కమిషన్

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

- ఈ బాధ్యతను బిసి కమిషన్‌కు అప్పజెప్పడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం
- రెండు వారాల్లో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




హైదరాబాద్అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్లను త్వరగా తేల్చితే స్థానిక ఎన్నికల్లో లబ్ది ఉంటుందని పిటిషనర్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీ.ఓ. విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ జీ.ఓ. ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు.





## మయోనైజ్ పదార్థంపై
# ఏడాది పాటు నిషేధం

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం...**
**మయోనైజ్ ఉత్పత్తి, నిల్వ, అమ్మకాలపై నిషేధం విధించిన ప్రభుత్వం**
**నేటి నుంచి ఇది అమలులోకి వస్తుందని వెల్లడి**
**గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనె, ఉప్పుతో తయారు చేసే మయోనైజ్**
**మయోనైజ్ తినడంతో అనారోగ్యం పాలవుతున్న ఘటనలు**

హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంతోమంది ఇష్టంగా తినే మయోనైజ్‌పై నిషేధం విధించింది. మయోనైజ్ ఉత్పత్తి, నిల్వ, అమ్మకాలపై ఒక సంవత్సరం నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇది అక్టోబర్ 30, 2024 (నేటి నుంచి) అమలులోకి వస్తుందని ప్రకటించింది.

**మయోనైజ్‌పై అధికారులతో మంత్రి సమీక్ష**

మంత్రి దామోదర రాజనర్సింహ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మయోనైజ్‌పై నిషేధం విధించాలని నిర్ణయం తీసుకున్నారు. **మిగతాది 2లో...**

# విద్యుత్ చార్జీలు పెంచకుండా అడ్డుకున్నాం

**రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ సంబురాలు**



## ఇప్పుడు ఎన్నికలు పెడితే..
# సెంచరీ కొడతాం



**హిట్ వికెట్ కాకుండా చూసుకోండి**
**మీ మంత్రులే మిమ్మల్ని ఔట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు**
**మా అధినేత కేసీఆర్‌తో మీకు పోలికా?**
**రేవంత్‌పై హరీశ్‌రావు మండిపాటు**

హైదరాబాద్: అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):"రేవంత్.. మా అధినేత కేసీఆర్‌కు, మీకు పోలికా? ఎక్కడైనా పొంతన ఉందా? నక్కకూ నాకలోకానికి ఉన్నంత తేడా ఉంది. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? రాకపోతే మీరు తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యేవారా? మీ ముఖ్యమంత్రి పదవి.. కేసీఆర్ పెట్టిన భిక్ష" అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. **మిగతాది 2లో...**

# టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు...




- పాలకమండలిలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు
- 24 మంది సభ్యులతో పాలకమండలి
- ఏపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు చోటు
- తెలంగాణ నుంచి నన్నూరి నర్సిరెడ్డికి చోటు



అమరావతి,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి చైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. టీటీడీ చైర్మన్, సభ్యులను ఈరోజు సాయంత్రం టీటీడీ ప్రకటించింది. 24 మంది సభ్యులతో పాలకమండలిని ప్రకటించింది. టీటీడీలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కింది. ఏపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. టీటీడీ బోర్డు సభ్యులు... జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి (కోవూరు ఎమ్మెల్యే), ఎంఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే), పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి), జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ), శ్రీ సదాశివరావు నన్నపనేని, కృష్ణమూర్తి (తమిళనాడు), కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్ ఆర్ఎన్ (కర్ణాటక), జస్టిస్ హెచ్ఎల్ దత్ (కర్ణాటక), శాంతారామ్, పి.రామ్మూర్తి (తమిళనాడు), జానకీ దేవి తమ్మిశెట్టి, బూంగునూరు మహేందర్ రెడ్డి (తెలంగాణ), అనుగోలు రంగశ్రీ (తెలంగాణ), బూరగాపు ఆనందసాయి (తెలంగాణ), సుచిత్ర ఎల్ల (తెలంగాణ), నరేశ్ కుమార్ (కర్ణాటక), డా.ఆదిత్ దేశాయ్ (గుజరాత్), శ్రీసౌరభ్ హెచ్ బోరా (మహారాష్ట్ర).

# మయోనైజ్ పదార్థంపై ఏడాది పాటు నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత సాయంత్రానికి నిషేధానికి సంబంధించి ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కల్తీ ఆహారం తీసుకొని పలువురు అనారోగ్యం పాలవుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, ఫుడ్ స్టాల్స్‌లో తరుచూ తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్, ఐదు మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలన్నారు.

## ఏమిటీ మయోనైజ్?

మయోనైజ్ ఎక్కువగా బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్, ఇతర ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకొని తినే ఆహార పదార్థం. మయోనైజ్‌ను గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనె, ఉప్పుతో తయారు చేస్తారు. ఉడికించని పదార్థం కాబట్టి మయోనైజ్‌లో హానికర బాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఈ మయోనైజ్ కారణంగా చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ హోటళ్లు తీరు మార్చుకోకపోవడంతో ఫుడ్ సేఫ్టీ విభాగం రంగంలోకి దిగి నిషేధం విధించాలని నిర్ణయించింది.

బంజారాహిల్స్, అల్వాల్ తదితర ప్రాంతాల్లోని పలు హోటళ్లలో మయోనైజ్‌ను తిన్నవారు అనారోగ్యానికి గురైనట్లుగా గుర్తించారు. బంజారాహిల్స్, జూబ్లిహిల్స్ ప్రాంతాల్లోని పలు హోటళ్లలో దాడుల సమయంలోనూ నాసిరకం మయోనైజ్‌ను అధికారులు గుర్తించారు. అదేవిధంగా, సికింద్రాబాద్, టోలిచౌకి, చాంద్రాయణగుట్ట, కాటేదాన్, బంజారాహిల్స్‌లోని పలు హోటళ్లలోని షవర్మ, మండి బిర్యానీ, బర్గర్ల పైనా బల్దియాకు ఫిర్యాదులు అందాయి.

# విద్యుత్ చార్జీలు పెంచకుండా అడ్డుకున్నాం

### రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ సంబురాలు




హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): కరెంట్ చార్జీలను పెంచాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి చెక్ పెట్టించ గలిగామని బీఆర్ఎస్ చెబుతోంది. ఇఆర్‌సిని కలి వాదనలు సక్రమంగా వినిపించడం వల్లనే పెంపు సాధ్యం కాలేదని అంటున్నారు. సామాన్యుడిపై విద్యుత్ భారం పడకుండా ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్ ముందు తమ వాదనలు బలంగా వినిపించి పేద ప్రజలపై భారం పడకుండా చూడడంలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన గొప్ప విజయం సాధించిందని అంటున్నారు. విద్యుత్ బిల్లుల తగ్గింపుపై విజయం సాధించిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# పదేళ్ళ విధ్వంసక పాలనలోని చీకట్లు తొలిగాయి:సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
దీపావళి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గత పదేండ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతోందన్న ధీమా వ్యక్తం చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఈ దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# కులగణన దేశానికే ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సర్వేను దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో పరిగణనలోకి తీసుకునేలా మోడల్ డాక్యుమెంట్ తయారు చేసి కేంద్రానికి పంపుతాం.
రేవంత్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదు. కాంగ్రెస్ పార్టీనే ఈ గుర్తింపు ఇచ్చింది. మీరంతా కష్టపడితేనే నాకు సీఎం బాధ్యత వచ్చింది. గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే మరో చర్చకు తావు లేదు.చర్చకు అవకాశమిచ్చారంటే వారు పార్టీ ద్రోహులే.పార్టీ ఎజెండాతోనే ప్రజల్లోకి వెళ్లాం. పార్టీ విధానాన్ని అమలు చేయడమే ప్రభుత్వ విధానం. అందుకే కాంగ్రెస్ పార్టీ ఐడియాలజీతో సంబంధం ఉన్న నిరంజన్‌ని బీసీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించాం. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా ప్రతి క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉంది. చట్టాన్ని అమలు చేస్తాం తప్ప, వ్యక్తిగత ఎజెండాతో పనిచేయం. ప్రతిపక్షాల కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి.

**ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా...**

ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నియామకపత్రాలు అందించాం. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలను భర్తీచేశాం. గ్రూప్ 1 విషయంలోనూ ప్రతిపక్షాలు రకరకాల అపోహలు సృష్టించి అడ్డుకోవాలని చూశాయి. తొలుత జీవో 29 ఇచ్చినప్పుడు గానీ, నోటిఫికేషన్ వచ్చినప్పుడు గానీ, ప్రిలిమ్స్ ఫలితాలు వెలువడినప్పుడు గానీ కోర్టుకు పోలేదు. కానీ మెయిన్స్ నిర్వహించే ముందు జీవో 29పై కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. సుప్రీంకోర్టు కూడా వారి పిటిషన్‌ను కొట్టేసింది. కొంతమంది అగ్రవర్ణాల కోసమే గ్రూప్ 1 నిర్వహిస్తున్నారని, బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారనే వాదన తీసుకొచ్చారు. కానీ గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన 31,383 మందిలో 10 శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాల వారు ఉంటే బీసీలు 57.11 శాతం, ఎస్సీలు, 15.38, ఎస్టీలు 8.87, ఈడబ్ల్యూఎస్ 8.84 శాతం ఉన్నారు. స్పోర్ట్స్ కోటాలో 20 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు' అని రేవంత్‌రెడ్డి వివరించారు.

**కులగణన.. దేశానికి మనమిచ్చే సందేశం**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన ఈ దేశానికి మనమిచ్చే ఒక సందేశం అని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ సామాజిక, ఆర్థికసర్వే ద్వారా ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి చేయూత ఇచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. బుధవారం కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో, మీడియాతో ఆయన మాట్లాడారు. 'కులగణన రాజ్యాంగ మూలసూత్రాన్ని కాపాడుతుంది. రాజ్యాంగంలో సమాన హక్కు చాలా ముఖ్యమైనది. కులగణన చేస్తేనే సమాజంలో అందరికీ సమాన హక్కులిచ్చే అవకాశం ఉంటుంది. పార్టీ శ్రేణులు ఇచ్చే సలహాలు, సూచనలను సర్వేలో పొందుపరుస్తాం. ఈ సర్వేలో సమాజంలోని అన్ని వర్గాలను, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కమిషన్లు, ఆయా శాఖల ఉన్నతాధికారులను భాగస్వాములను చేస్తాం. సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ తదితర అంశాలపై సమాచారాన్ని సర్వేలో సేకరిస్తాం. రాహుల్‌గాంధీ సైనికులుగా ఆయన ఆలోచనలను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత పార్టీ నేతలందరిపై ఉంది. జిల్లాస్థాయిలో కాంగ్రెస్ కమిటీలు విస్తృతంగా అభిప్రాయాలు సేకరిస్తాయి. రాష్ట్ర స్థాయిలో మేధావులు, సామాజికవేత్తలు, ప్రగతిశీల వాదులతో నవంబరు 5న హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారి అభిప్రాయాలు తెలుసుకుంటాం. ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న కులగణనపై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయి' అని భట్టి అన్నారు.

# పంచాయితీలను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్రం

### కేంద్రం నిధులు ఇచ్చినా దారి మళ్లించిన రేవంత్
### రు.1200కోట్లు విడుదల చేస్తే..కేవలం 200 కోట్లు ఖర్చు
### సర్కార్ తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి రఘునందన్ రావు



హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
గ్రామాల అభివృద్ధిని కాంక్షించి కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు.
పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో పంచాయతీ సెక్రటరీలు కూడా సొంత డబ్బుతో పనులు చేయించారన్నారు.
రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా గ్రామాలు బాగుండాలని కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని రఘునందన్ రావు అన్నారు. ఆరునెలల క్రితం కేంద్రం 1200 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని భాజపా కార్యాలయంలో మిడియాతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు వెచ్చించడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని.. కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన నిధులు దారి మళ్లించారని మండిపడ్డారు. ఆ బిల్లులు ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.600 కోట్లు పెండింగ్‌లో పడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెకమండేషన్ మేరకు రూ.500 కోట్లు విడుదల చేసిందని.. నేషనల్ హెల్త్ మిషన్ కోసం 300 కోట్ల రూపాయలు విడుదల చేసిందని చెప్పారు. హెల్త్ సెంటర్ నిర్మాణం చేయాలని చెప్పిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకంతో గ్రామాలలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేసినా తెలంగాణ సర్కార్ వాటిని దారి మళ్లించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కావాలి కానీ కేంద్రం పేరు చెప్పేందుకు మనసు రాదంటూ మండిపడ్డారు. నియోజకవర్గానికి 3,500 ఇల్లు కట్టిస్తామని చెప్పిందని.. వాటిని కట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని.. ఆ నిధులను కూడా అర్బన్ మిషన్ కింద సేకరిస్తోందన్నారు. వాటిని ఎవరు పంచాలనేది దానిపై కొట్లాట మొదలైందన్నారు. కలెక్టర్‌లతో కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా ఆ నిధులు అందజేస్తామని చెబుతున్నారన్నారు. మునిసిపాలిటీలలో 250 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం విడుదల చేసిందన్నారు. మా పైసలు తీసుకుని మా భాగస్వామ్యం లేకుండా ఇళ్లను పంచిపెడితే కచ్చితంగా అడ్డుకుంటాం. ఇందిరమ్మ కమిటీలు చెల్లుబాటు కావు. ప్రతి స్కీంకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లు పెట్టే భావదారిద్య్రం ఉంది. మూసీ శుద్ధి, సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు . అభివృద్ధి పేరుతో కార్పోరేట్ కంపెనీలకు పనులు అప్పజెబితే మాత్రం వ్యతిరేకిస్తాం. మూసీకి కొండ పోచమ్మ సాగర్ నుంచి నీరు తెస్తే 1500 కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. మల్లన్న సాగర్ నుంచి నీరు తెస్తే 7వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. పేదోళ్లు కట్టిన ఇంటి వద్ద 50 మీటర్ల దూరం అభివృద్ధి చేస్తాం అంటున్నారు. మూసీ అభివృద్ధిలో క్విడ్ ప్రోక్రో ఉన్నట్లు అనుమానం ఉంది. ప్రజలు బీఆర్ఎస్‌కు సీఆర్ఎస్ ఇచ్చారు.. వారిని ఫాం హౌస్‌లకు పరిమితం చేశారు. పేదోళ్లకు కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఇస్తుంది. కుక్కతోక పటాకులు పేలుస్తారా .. సుతీల్ బాంబు పేలుస్తారా చూడాలి. అదిపేలుస్తాం ఇది పేలుస్తాం అని బ్రేకింగ్ ప్లేట్ల కోసం మాట్లాడకుండా అవినీతిపరులను అరెస్టు చేస్తే మేం స్వాగతిస్తాం అని ఎంపీ రఘునందర్ రావు వెల్లడించారు.

# అయోధ్యలో అట్టహాసంగా దీపోత్సవం

### 25లక్షల దీపాల వెలగింపుతో గిన్నిస్ రికార్డు అయోధ్య రామాలయ ప్రతిష్ట తరవాత తొలి ఉత్సవం
### దీపహారతితో ధగధగలాడిన సరయూ తీరం దోపోత్సవాన్ని ప్రారంభించిన సిఎం యోగి

**అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):**
దీపావళి పండగకు ముందు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దీపోత్సవ వేడుకల్లో భాగంగా ఇవాళ (బుధవారం) ఏకంగా 25 లక్షల మట్టి ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. గిన్నీస్ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో ఇంత పెద్ద సంఖ్యలో దీపాలను వెలిగించారు. దీపోత్సవం వేడుకలతో పవిత్ర అయోధ్య నగరం ఆధ్యాత్మిక, సాంప్రదాయ, సాంస్కృతిక శోభను సంతరించుకుంది. మయన్మార్, నేపాల్, థాయ్‌లాండ్, మలేషియా, కాంబోడియా, ఇండోనేషియా దేశాలకు చెందిన కళాకారులు పలు ఆకట్టుకునే ప్రదర్శనలు చేశారు. రామ్ లీలా ప్రదర్శనతో పాటు పలు ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు కూడా ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.కాగా ఇవాళ (బుధవారం) తెల్లవారుజామున ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ దీపోత్సవ హారతిని స్వీకరించారు. కళాకారులు ప్రదర్శించిన రథాన్ని కూడా ఆయన లాగారు. కాగా అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ తర్వాత ఇదే తొలి దీపోత్సవం కావడంతో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



# ఇప్పుడు ఎన్నికలు పెడితే.. సెంచరీ కొడతాం

(మొదటి పేజీ తరువాయి)

పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మీకు ఫుట్‌బాల్ ఒక్కటే వచ్చు.. నాకు క్రికెట్ ఒక్కటే వచ్చు. మీ ఫుట్‌బాల్ భాషలో చెప్పాలంటే.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గోల్ కొట్టేది మేమే. నా క్రికెట్ భాషలో చెప్పాలంటే వికెట్ తీసేది మేమే. ఇప్పుడు ఎన్నికలు పెడితే.. భారాసకు 100 సీట్లు వస్తాయి. ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. మళ్లీ సీఎంగా కేసీఆర్ ఉండాలని ప్రజలు నిర్ణయానికొచ్చారు. ఈ లోపు హిట్ వికెట్ కాకుండా చూసుకోండి. ఎందుకంటే మీ మంత్రులే మిమ్మల్ని ఔట్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఒక మంత్రి గవర్నర్‌ను కలిశారు. ఇంకో మంత్రి హెలికాప్టర్ ఇవ్వలేదని అలిగారు. మరో మంత్రేమో దిల్లీకి వెళ్లారు. కొంత మంది తాము సీఎం అవుతామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. కుర్చీని ఎప్పుడు... ఎవరు గుంజుకుపోతారోనన్న భయంతో మీరున్నారు. నన్ను డీల్ చేయడం తర్వాత సంగతి. మిమ్మల్ని ఎలా డీల్ చేయాలో మేము రాసి పెట్టుకున్నాం. భారాసను, కేసీఆర్‌ను చెరిపేయడం ఎవరి తరమూ కాదు.

మూసీ పరిస్థితులను చూసేందుకు వాడపల్లి నుంచి వికారాబాద్ వరకూ మీరు పాదయాత్ర చేస్తానని అన్నారుగా. నేను, కేటీఆర్ వస్తాం. రేపా? ఎల్లుండా? సమయం చెప్పండి. సెక్యూరిటీ లేకుండా మీరు పాదయాత్రలో పాల్గొనాలి. అప్పుడు ప్రజలు ఏం చెబుతారో విందాం. ముందు ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలుచేయండి.

కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, మళ్లీ వచ్చి మీరు గతంలో మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేశారు. అలాగే ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి చేస్తామని మాట తప్పారు. మాట మీద నిలబడని ముఖ్యమంత్రిగా మీరు చరిత్రలో నిలుస్తారు. ఆరు మంత్రి పదవులను నింపడానికే మీకు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదు. మూసీ అభివృద్ధికి మేము అనుకూలం. కానీ దాని పేరు చెప్పి దోపిడీ చేస్తామంటే.. పేదల ఇళ్లు కూలగొడతామంటే వ్యతిరేకిస్తాం. బాపూఘాట్‌లో భారీ గాంధీ విగ్రహం పెడితే స్వాగతిస్తాం. కేటీఆర్ ప్రశ్నించే గొంతుక. ఆయనపై పగబడుతున్నారు. అక్రమ కేసులు పెడుతున్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌పై ఏసీబీ విచారణ చేయనివ్వండి. ఏం కేసులు పెడతారో చూస్తాం.





# వాస్తవమైన వార్తలు రాస్తేనే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుంది

## వర్ధన్నపేట ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) కార్యాలయాన్ని ప్రారంభించిన ఈగ మల్లేశం

**వర్ధన్నపేట, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):** సమాజానికి అవసరమైన రీతిలో వాస్తవమైన వార్తలు రాస్తేనే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. బుధవారం వర్ధన్నపేట ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ముందుకు తీసుకుపోవడం, ప్రజలను చైతన్య పరచడం, సద్భావనతో, నిష్కలమైన మనసుతో జర్నలిస్టులు అందరు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఎవ్వరికి తలవంచక శక్తి యుక్తితో ప్రయాణం చేస్తూ, ఎవరో చెప్పిన అపోహలను నమ్మి వార్తలు రాయకుండా, ప్రత్యక్షంగా చూసి, తెలుసుకున్నపుడు, క్షేత్ర స్థాయిలో ప్రయాణం చేసి వాస్తవాలను వెలికి తీసి, ఈ సమాజానికి అందించాల్సిన బృహత్తరమైన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. ప్రజా క్షేత్రంలో మంచి అనిపించుకుంటే రాబోయే రోజుల్లో ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకొని కమిటీ నియమించుకోవడం శుభ పరిణామం అని, జర్నలిస్టులకు, ప్రెస్ క్లబ్ కు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ వుంటాయని హామీ ఇచ్చారు. ప్రతి జర్నలిస్ట్ అందరిని సమన్వయం చేసుకుంటూ ఐక్యతతో పని చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయ ప్రారంభానికి విచ్చేసిన ఈగ మల్లేశంను, ప్రెస్ క్లబ్ సభ్యులు



ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ, కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర నాయకులు రాయపురం సాంబయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, జిల్లా నాయకులు కమ్మగోని ప్రభాకర్, బీజేపీ మండల అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షులు పెద్దూరి రాజుకుమార్, జిల్లా నాయకులు కొండేటి సత్యం, బిఆర్ఎస్ నాయకులు సిలివేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, కరిమిళ్ల సంపత్ రావు, ఎండీ రహీం, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కర్ర మాలతి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఇల్లందుల ఎలీషా. తీగల సునీత, నాయకులు పోశాల వెంకన్న గౌడ్, నాంపల్లి రవి, గుజ్జ రవీందర్ రెడ్డి, మల్లు నాయక్, సీపీఐ మండల కార్యదర్శి ఆరెల్లి రవి, మండల సహాయ కార్యదర్శి సాతుపెల్లి భాస్కర్, మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్, మాదిగ జేఏసీ నాయకులు జన్ను రాములు, వల్లందాసు కుమార్, జక్కి శ్రీకాంత్, మారపాక ఎల్లయ్య, కంజర్ల మహేష్, పర్వతగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముదురుకోల నాగరాజు, రఫీ ఎండీ, నాగుల రాజు, శ్రీకాంత్, చందన్, వర్ధన్నపేట ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ఐత ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు మల్లెపాక కుమార్, ఉపాధ్యక్షులు మునుకుంట్ల దేవేందర్, బుర్ర వెంకటరమణ, ట్రెజరర్ పిట్టల భాస్కర్, ప్రచార సమన్వయ కర్త వసునూరి మురళి, ముఖ్య సలహాదారు బిర్రు కరుణాకర్, కార్యవర్గ సభ్యులు కత్తి వేణు కుమార్, గడ్డం నాగరాజు, గడ్డం రాజేందర్, ఆభర్ల రాజ కొమురయ్య, అనిల్ సట్ల, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

























# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి

## - అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు



**చెన్నారావుపేట, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):**
రెడ్డిపాలెం ఇన్ ఫ్రాంట్ జీసస్ పాఠశాలలో జరిగిన వరంగల్ జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాల బాలికల సాఫ్ట్ బాల్ పోటీలలో ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి బదావత్ ప్రశాంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్. సునీత తెలిపారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నవంబర్ నెల 3,4,5 తేదీలలో మెదక్ జిల్లా తూప్రాన్ లో జరుగనున్న పోటీల్లో ప్రశాంత్ పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మరోసారి ప్రశాంత్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచాలని ఆకాంక్షిస్తూ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. ఉప్పరపల్లి విద్యార్థులు క్రీడారంగంలో ముందంజలో ఉండడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్నని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ ఎం సునీత, ఉపాధ్యాయులు రాగి శశిధర్, కె.సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్ కుమార్, సిహెచ్ మాధవి, ఎల్ మొగిలి, జి సుందర్, కె.మాధవి, రమాదేవి, రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహెద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు చార్జీలు పెంచి

# ప్రజలపై భారం మోపే కుట్ర



రాయపర్తి, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ పార్టీ కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై రూ18,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపాలనే కుట్ర చేసిందని ఆ ప్రయత్నాన్ని బిఆర్ఎస్ పార్టీ భగ్నం చేసిందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సి%శీ%హ నాయక్ అన్నారు. ఈ ప్రయత్నాన్ని ఆపినందుకు బుధవారం మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బిఆర్ఎస్ శ్రేణులు బానసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నర్సింహ నాయక్ మాట్లాడుతూ 18,500 కోట్లు విద్యుత్ చార్జీలు ప్రభుత్వ పెంచే కుట్రను భగ్నం చేసి ప్రజల పక్షన విజయం సాధించినందుకు సంబురాలు జరుపుకొంటున్నామని అన్నారు.ఇది ప్రజా విజయం బి ఆర్ ఎస్ పార్టీ విజయం అని అన్నారు.రాబోయే రోజులలో ప్రజలకి ఎటువంటి ఇబ్బంది జరిగిన బి ఆర్ ఎస్ పార్టీ చూస్తూ ఊరోకోదనీ అన్నారు.ఈ విజయం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు అనిఇంకొకసారి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న, ప్రతి పక్షంలో ఉన్న ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా పార్టీ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి,మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్ రావు, పిఏసిఎస్ చైర్మన్ కుందూరు రామ్ చంద్రా రెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ నయీమ్,మండల పార్టీ బిసి సెల్ అధ్యక్షుడు చెవ్వు కాశి నాథం,ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ జాజు నాయక్,మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, పోగులకొండ వేణు, కర్ర రవీందర్ రెడ్డి,కుందూరు యాదగిరి రెడ్డి, కుక్కల భాస్కర్, గాదె రవీందర్ రెడ్డి, బొడ్డు రంగయ్య, ముద్రబోయిన సుధాకర్, చందు రాము,భాషబోయిన సుధాకర్, గజవెల్లి ప్రసాద్, కంది ప్రభాకర్, ఎండీ అక్బర్, చెడుపాక కుమార్, సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి, చిల్వేర్ సాయి గౌడ్, గూబ అశోక్, దేశబోయిన ఉపేందర్, చిన్నల ఉప్పలయ్య, జగన్, ఐత రవి, ఉబ్బని మధు, తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన డైట్ ఛార్జీలు




హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త)::రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు దీపావళి పండగపూట శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని గురుకుల, హాస్టల్స్ విద్యార్థులకు మేలు చేకూరేలా రేవంత్ రెడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల గురుకులాలు, పలు సంక్షేమ హాస్టళ్లు, వసతి గృహాల్లోని విద్యార్థుల కాస్మోటిక్స్, డైట్ చార్జీలను పెంచింది. ప్రస్తుతం 3 నుంచి 7వ తరగతి వరకు ఉన్న డైట్ ఛార్జీలు రూ.950 ను రూ.1330కి పెంచారు.8 నుంచి 10వ తరగతి వరకు రూ. 1100 నుంచి రూ. 1540 కి పెంచారు. ఇక ఇంటర్ నుండి పీజీ వరకు రూ. 1500 నుంచి రూ. 2100 కి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక కాస్మోటిక్ ఛార్జీలు 3 నుంచి 7వ తరగతి వరకు ప్రస్తుతం రూ.55 ఉండగా దానిని రూ. 175కి పెంచారు. 8 నుంచి 10వ తరగతి వరకు రూ.75 నుంచి రూ. 275 వరకు పెంచారు. దీనివలన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7,65,700 మంది హాస్టల్ విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

# పిడుగుపాటుతో వ్యక్తి మృతి

చెన్నారావుపేట, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
చెన్నారావుపేట మండలం కల్ నాయక్ తండాలో పిడుగుపాటుకు గుర్రై కొర్ర నాగరాజ్ 27సం: అనే వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నాగరాజు రోజువారి పని నిమిత్తం కూలి పనికి వెళ్లారు. పనిచేస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా వర్షం పడుతూ పిడుగు పడింది. దీంతో కూలి పని చేస్తున్న నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడని చెబుతున్నారు. మృతుడికి భార్య విజయ పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# గంగుల కమలాకర్ కుటుంబానికి బిల్లా సుధీర్ రెడ్డి పరామర్శ



రాయపర్తి, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీ నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆమె చిత్రపటానికి భారత రాష్ట్ర సమితి జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి నివాళులు అర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, మన్మోహన్ రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు



రాయపర్తి, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):ద
దీపావళి పండుగను సందర్భంగా మండల ప్రజల భద్రత దృష్య దుకాణా దారులు ఎవరూ అనుమతి లేకుండా బాణాసంచాలు నిల్వ చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి గల దుకాణదారులు చట్టంలో పేర్కొన్న విధంగా ఫైర్, సంబంధిత శాఖల అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని అన్నారు. అనుమతిలో పేర్కొన్న విధంగా అన్ని రకాల ఫైర్ సేఫ్టీ పద్ధతులు, పరికరాలు ఉండేవిధంగా చూసుకోవాలనీ,బాణాసంచా నిల్వ, అనుమతి లేకుండా అమ్మేవారి వివరాలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ప్రజలకు కెసిఆర్ దీపావళి శుభాకాంక్షలు



హైదరాబాద్,అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీపావళి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు. దీపావళి పర్వదినానికి హిందూ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. మనం పయనించే ప్రగతిపథంలో అడుగడుగునా అడ్డుపడే నరకాసురుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని సీఎం కేసీఆర్ప్రజలకు ఉద్బోధించారు. లక్ష్మీదేవి కృపాకటాక్షాలు తెలంగాణ ప్రజలపై ఉండాలని, ప్రతి ఇల్లు సకల శుభాలు, సిరిసంపదలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు.

## జీనియస్ సీడ్స్ ఆధ్వర్యంలో

# వరి పంట క్షేత్ర ప్రదర్శన



రాయపర్తి, అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త): మండల%శీ%లోని కొండూరు గ్రామానికి చెందిన రైతు పోలినేని శ్రీధర్ వరి పొలంలో జీనియస్ సీడ్స్ ఆధ్వర్యంలో జీనియస్ 101 అనే వరి రకంపై బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ఎమ్ డి.శ్రీనివాస్ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ జీనియస్ సీడ్స్ వారి జీనియస్ -101 రకం తినడానికి చాలా బాగుంటాయని, అధిక దిగుబడి అధిక నాణ్యతగా వస్తుంది అని,క్షేత్ర ప్రదర్శనకు విచ్చేసిన రైతులు కూడా పంటను చూసి చాలా ఆనందం వ్యక్తం చేసారని చెప్పారు.ఈ క్షేత్ర ప్రదర్శనకు వర్ధన్నపేట లోని జయ ఎంటర్ప్రైస్సెస్ ఫర్టిలైజర్ యజమాని కార్తీక్,మండలంలోని వివిధ గ్రామాల నుండి చాలా మంది రైతులు,కంపెనీ మార్కెటింగ్ ఆఫీసర్ రాయిని శ్రీకాంత్ పాల్గొన్నారు.

# చిట్టినాయుడు..నువ్వా కేసీఆర్ పేరును తుడిచేది? : కెటిఆర్



హైదరాబాద్అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ను ప్రజలు మర్చిపోయేలా చేశానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిట్టి నాయుడు..నువ్వా కేసీఆర్ పేరును తుడిచేదని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్ర కేసీఆర్ అని, నువ్వు చెప్పులు మోసిన నాడు ఆయన ఉద్యమానికి ఊపిరి పోశారని అన్నారు. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్న నాడు, ఆయన ఉన్న పదవిని తృణప్రాయంగా వదిలేసారని పేర్కొన్నారు. నువ్వు ఉద్యమకారుల మీద గన్ను ఎక్కుపెట్టిన నాడు, ఆయన ఉద్యమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టారని గుర్తు చేశారు. నువ్వు సాధించుకున్న తెలంగాణను చంపేటందుకు బ్యాగులు మోస్తున్ననాడు, ఆయన తెలంగాణ భవిష్యత్కు ఊపిరి పోశారని అన్నారు.ఓటుకు నోటు కేసులో చంద్రబాబును ఫినిష్ చేసిందే రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్ అన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఫ్యాక్షన్ భాష మాట్లాడుతున్నాడని విమర్శించారు. తెలంగాణ భవన్లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డి భస్మాసురుడిలా మారాడని అన్నారు. చంద్రబాబుతో సహా టీడీపీలో చాలామంది సీనియర్ నాయకులను ఫినిష్ చేశారని, ఇప్పుడు కాంగ్రెస్లోకి వచ్చి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మధుయాష్కీని ఫినిష్ చేశాడని ఎద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రే వాళ్లను ఫినిష్ చేస్తా, వీళ్లను ఫినిష్ చేస్తానని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ వ్యతిరేక వాదులు కూడా కెసిఆర్ను ఫినిష్ చేస్తానని అనలేదని చెప్పారు. సీఎం రేవంత్రెడ్డి ఇంకా ఫ్యాక్షన్ బుద్ధులు పోలేదని దాసోజు శ్రవణ్ విమర్శించారు.

# గిరిజన బాలిక సాయిశ్రద్ధకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక సాయం

హైదరాబాద్ అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం అవుతున్న గిరిజన బాలిక సాయిశ్రద్ధకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. కుమురం భీం జిల్లా , జైనూరు మండలం, జెండాగూడ గ్రామానికి చెందిన గిరిజన బాలిక సాయిశ్రద్ధ నీట్లో ర్యాంక్ తెచ్చుకొని, మంచిర్యాల మెడికల్ కాలేజీ లో ఎంబిబిఎస్లో సీటు సాధించింది. అయితే కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేక సాయిశ్రద్ధ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమ బిడ్డ చదువుకు సాయం చేయాలని బాలిక తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.ఈ విషయం సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో వెంటనే డాక్టర్ కావాలన్న ఆ అమ్మాయి కలను నెరవేర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే సాయిశ్రద్ధ కుటుంబాన్ని బుధవారం పిలిపించి, ఆమె చదువుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో సిఎం రేవంత్ అందజేశారు. ఈ సందర్భంగా సాయిశ్రద్ధ, ఆమె కుటుంబ సభ్యులు సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# బిఆర్ఎస్ నుంచి కాం గ్రెస్ పార్టీలోకి రావడానికి 20 మంది ఎమ్మెల్యేలు సిద్ధం

## రోడ్లు, భవనాల శా ఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి



హైదరాబాద్ అక్టోబర్ 30,(జర్నలిస్ట్ వార్త):
బిఆర్ఎస్ నుంచి కాం గ్రెస్ పార్టీలోకి రావడానికి 20 మంది ఎమ్మెల్యేలు సిద్ధం గా ఉన్నారని, కానీ, తామే ఆపామని రోడ్లు, భవనాల శా ఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వ్యాఖ్యానించారు. జ న్వాడలో జరిగింది రేవ్ పార్టీ కాదు, రావుల పార్టీ అని మంత్రి ఎద్దేవా చేశారు. కులగణనకు సంబంధించి గాం ధీభవన్కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తోందని ఆయన ఆ వేదన వ్యక్తం చేశారు. ఎంత ఇబ్బంది ఉన్నా మేనిఫెస్టో లో ప్రకటించని హామీలను అమలు చేస్తున్నామని ఆయ న తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వాన్ని విమర్శించడ మే బిఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారని కోమటిరెడ్డి ఆరోపించారు. వెనుకబడిన కులాలపై బిఆర్ఎస్కు ఏ మాత్రం ప్రేమలేదని ఆయన మండిపడ్డారు.

# ఎన్టీఆర్ ఫ్యామిలీ నుంచి మరో ఎన్టీఆర్

శ్రీ సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య లాంటి సినిమాలతో డైరెక్టర్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న వైవీఎస్ చౌదరి ఇప్పటికే పలువురు యాక్టర్లను ఇండస్ట్రీకి పరిచయం చేసాడు. తాజాగా సీనియర్ ఎన్టీఆర్ కుటుంబం నుంచి మరో కొత్త నటుడిని అందరికీ పరిచయం చేస్తున్నాడు. దివంగత సీనియర్ ఎన్టీఆర్ కుమారుడు నందమూరి హరికృష్ణ మనవడు (జానకిరామ్ కుమారుడు) నందమూరి తారకరామారావు ఫస్ట్ దర్శన్ వీడియోను వైవీఎస్ చౌదరి షేర్ చేశాడు. ప్రొడక్షన్ నంబర్ 1గా రాబోతున్న ఈ చిత్రాన్ని వైవీఎస్ చౌదరి సతీమణి యలమంచిలి గీత నిర్మిస్తుండటం విశేషం. నందమూరి తారకరామారావు హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు ఫస్ట్ దర్శన్ వీడియో చెప్పకనే చెబుతోంది. నటుడిగా అందరినీ ఇంప్రెస్ చేసేందుకు యాక్టింగ్, ఫైట్స్‌లో శిక్షణ తీసుకోవడంతోపాటు మేకోవర్ కూడా మార్చుకున్నట్టు తాజా లుక్స్‌తో తెలిసిపోతుంది. ఈ చిత్రానికి లెజెండరీ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా.. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు సమకూరుస్తున్నారు. చంద్రబోస్ పాటలు అందిస్తున్నాడు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. తాజాగా వైవిఎస్ చౌదరి ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి ఎన్టీఆర్‌ను పరిచయం చేశారు. దీంతో ఈ అప్‌కమింగ్ హీరోకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అతని ఎంట్రీని స్వాగతిస్తూ .. జూనియర్ ఎన్టీఆర్ ఆల్ ది బెస్ట్ చెబుతూ పోస్ట్ చేశారు. 'రామ్ సినీ ప్రపంచంలోకి నీ మొదటి అడుగుకు అభినందనలు. సినిమా ప్రపంచం నిన్ను ఆదరించడానికి ఎదురుచూస్తోంది. నువ్వు చేసే ప్రతి ప్రాజెక్ట్ విజయం సాధించాలని కోరుకుంటున్నా. ముత్తాత ఎన్టీఆర్, తాత హరికృష్ణ, నాన్న జానకిరామ్‌ల ప్రేమ, ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి. నువ్వు ఉన్నత శిఖరాలకు చేరుకుంటావనే నమ్మకం ఉంది. నీ భవిష్యత్తు దేదీప్యమానంగా ఉండాలి మై బాయ్' అంటూ జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. 'డియర్ రామ్.. నీకు శుభాకాంక్షలు. నువ్వు నీ తొలి సినిమాతోనే అందరూ గర్వపడేలా చేస్తావనే నమ్మకం ఉందని కల్యాణ్ రామ్ తెలిపారు. ఇక వాగ్దానం, ప్రతిజ్ఞ, ప్యాషన్.. సీనియర్ ఎన్టీఆర్ ఆశీస్సులతో నందమూరి తారక రామారావు ఇండియన్ సినిమాలోకి పవర్‌ఫుల్ ఎంట్రీ ఇస్తున్నారని వైవీఎస్ చౌదరి తెలిపారు.




# నయనతారపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ




అగ్ర కథానాయిక నయనతార జీవితంపై డాక్యుమెంటరీ ఫిల్మ్ సిద్ధమైంది. ఆమె వృత్తి, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దీనిని రూపొందించింది. ఇప్పటికే విడుదలైన ప్రోమో సినీప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈనేపథ్యంలో తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పలు విశేషాలను ఓటీటీ సంస్థ ప్రకటించింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. నవంబర్ 18 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టారు నయనతార. కాలేజీ రోజుల్లో ఆమె పార్ట్‌టైమ్ మోడల్‌గా వర్క్ చేశారు. ఓ సందర్భంలో ఆమెను చూసిన దర్శకుడు సత్యన్ అంతికాడ్.. 'మనస్సిక్కరే'లో నటిగా అవకాశం ఇచ్చారు. తొలుత దానిని తిరస్కరించిన ఆమె చివరకు ఓకే చెప్పారు. 2003లో పరిశ్రమలోకి వచ్చిన నయన్.. మలయాళం, తమిళం, తెలుగులో వరుస చిత్రాల్లో యాక్ట్ చేశారు. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్ పరంగా ఎన్నో అవమానాలు, ఎత్తుపల్లాలు చూశారు. 'నేను రౌడినే' సమయంలో దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి వీరి మధ్య ప్రేమ మొదలైంది. కొన్నేళ్లపాటు ప్రేమించుకున్న నయన్ - విఘ్నేశ్ పెద్దల అంగీకారంతో 2022లో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. నయనతార చిన్నప్పటినుంచి పెళ్లివరకూ సాగే ప్రయాణాన్ని ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నారు. పెళ్లి వేడుక డిజిటల్ రైట్స్ కోసం నెట్‌ఫ్లిక్స్ రూ.25 కోట్లు చెల్లించినట్లు సమాచారం. రెండేళ్ల క్రితం దీని ప్రోమో విడుదల చేశారు. నయన గొప్ప నటి మాత్రమే కాదని.. మంచి మనసున్న వ్యక్తి అందులో విఘ్నేశ్ తెలిపారు.

# లక్కీ భాస్కర్ మంచి సందేశాత్మక చిత్రం

## నిర్మాత నాగవంశీ వెల్లడి



దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం 'లక్కీ భాస్కర్' సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ దీనిని నిర్మించారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈనేపథ్యంలో నాగవంశీ సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని తాము విశ్వసిస్తున్నామన్నారు. కొన్ని సినిమాలు తెరకెక్కించిన తర్వాత ఆనందకరమైన ఫీలింగ్ వస్తుంది. అలాంటి ఓ సినిమా ఇది. సినిమా చూసిన తర్వాత బాగా తీశామనే ఫీలింగ్ వచ్చింది. అందుకే దీనిపై గట్టి నమ్మకంతో ఉన్నాం. ఈరోజు ప్రీమియర్ వేస్తున్నాం. దర్శకుడు వెంకీ అట్లూరితో మాకు మంచి అనుబంధం ఉంది. ఒక దర్శకుడితో రిలేషన్ సెట్ అయితే హిట్లు, ఎ÷-లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తాం కదా. అదేవిధంగా వెంకీతో నాకు మంచి ఫ్రెండ్‌షిప్ ఉంది. హిట్ లేదా ఎ÷-లాప్ ఏదైనా మా జర్నీ అలాగే కంటిన్యూ అవుతుంది. థ్రిల్లర్ జానర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. బ్యాంకింగ్ సెక్టార్‌లో ఉండే లోపాలు వాడుకొని హీరో ఎదిగే క్రమాన్ని దీనిలో చూపించాం. 1980-90లో ముంబయి ఎలా ఉంది? అప్పటి రోజుల్లో బ్యాంక్స్ ఎలా వర్క్ చేశాయి? స్టాక్ మార్కెట్ ఎలా ఉంది? ఇలాంటి విషయాలతో కొత్త ప్రపంచాన్ని సృష్టించాం. సినిమా మొదలైన 15 నిమిషాల్లోనే ప్రేక్షకులు భాస్కర్‌తో కనెక్ట్ అవుతారు. అతడు గెలవాలని కోరుకుంటారు. ఆ విషయంలో నేను గ్యారెంటీ ఇవ్వగలను. డబ్బు సంపాదించాలనిపించినప్పుడు మనిషి ఎంత దూరమైనా వెళ్తాడు అనేది ఈ సినిమా. కంటెంట్‌ను బాగా నమ్మాం. విభిన్నమైన కంటెంట్‌కు కమర్షియల్ హంగులు జోడించాం. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా చూడలేదు. ప్రేక్షకులకు ఎక్కడా బోర్ కొట్టదు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఒక ఫీల్‌తో వస్తారని నాగవంశీ చెప్పారు. థియేటర్ల సమస్య గురించి మాట్లాడుతూ.. ఈ పండుగకు చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. దానివల్ల మల్టీప్లెక్సులు దొరకడం కష్టంగా ఉంది. అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉంది. పరిస్థితులకు అనుగుణంగా సెట్ చేసుకొని ముందుకుసాగాలని అన్నారు. కిరణ్ అబ్బవరం 'క', 'అమరన్' కూడా విజయం అందుకోవాలని కోరుకున్నారు. తమ బ్యానర్‌లో బాలకృష్ణ హీరోగా చేయనున్న సినిమా అప్‌డేట్ గురించి మాట్లాడారు. దీపావళికి అప్‌డేట్ ఇద్దామనుకున్నాం. కాకపోతే సీజీ వర్క్ వల్ల కాస్త లేటు అవుతుంది. పండక్కి అప్‌డేట్ ఇవ్వలేకపోతున్నాం అని నాగవంశీ తెలిపారు.

# హిందీలో మరో ఛాన్స్ కొట్టేసిన రష్మిక



దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోనూ వరుస చిత్రాలు చేస్తూ కెరీర్‌లో దూసుకెళ్తున్నారు నటి రష్మిక గతేడాది 'యానిమల్'తో విజయాన్ని అందుకున్న ఆమె ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో వరుస షూటింగ్స్‌తో గ్యాప్ లేకుండా గడుపుతున్నారు. తాజాగా బాలీవుడ్‌లో మరో ప్రాజెక్ట్ ఓకే చేశారు. 'స్త్రీ', 'బేడియా', 'ముంజ్య' క్రియేటర్స్ దీనిని తెరకెక్కించనున్నారు. విభిన్న కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'థమా' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. ఈ యూనివర్స్ ఒక ప్రేమ కథ కోరుకుంటుంది. దురదృష్టవశాత్తూ అది చాలా ఉద్వేగంతో కూడుకున్నదని టీమ్ పేర్కొంది. ఆయుష్మాన్ ఖురానా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ముంజ్య' దర్శకుడు ఆదిత్య సర్పోత్దార్ దీనికి దర్శకత్వం వహించనున్నారు.

# 'అమరన్'.. భారీ ప్రీ-సేల్స్‌తో న్యూ రికార్డ్




శివకార్తికేయన్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన బయోగ్రాఫికల్ యాక్షన్ డ్రామా 'అమరన్' విడుదలకు సిద్ధమైంది. రేపు థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ అవుతున్న ఈ సినిమా ట్రైలర్, ఇతర ప్రమోషనల్ కంటెంట్ వల్ల భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రాజ్‌కుమార్ పేరియసామి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, బుక్ మై షోలో రికార్డు స్థాయిలో ప్రీ-సేల్స్ సాధించి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. గంటకు 17,000కు పైగా టిక్కెట్లు అమ్ముడవుతున్నట్లు సమాచారం. తమిళ సినిమాలలో ఇటీవలి కాలంలో ఇంతటి ప్రీ-సేల్స్ సాధించిన చిత్రం లేదు. ఈ రికార్డ్‌ని 'అమరన్' సొంతం చేసుకోవడం సినిమాపై ఏర్పడిన హైప్‌ను తెలుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ సినిమా పై భారీ ఆసక్తి ఉంది, దీన్ని బట్టి తెలుగులో కూడా శివకార్తికేయన్ కెరీర్ బెస్ట్ ఓపెనింగ్స్ నమోదు చేయనున్నారని అంచనా వేస్తున్నారు. 'అమరన్' సినిమాను కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రా రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియాతో కలిసి నిర్మించింది. ఈ చిత్రానికి తెలుగులో ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ ద్వారా పంపిణీ వ్యవహరించనుంది. శివకార్తికేయన్ నటన, సాయి పల్లవి మరియు ఇతర నటీనటుల పాత్రలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా ఉన్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది.తమిళనాడులోనే కాకుండా తెలుగురాష్ట్రాల్లో కూడా 'అమరన్' శివకార్తికేయన్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్ సాధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. కమర్షియల్ చిత్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సాధించిన శివకార్తికేయన్ ఈ సినిమాతో మరో మెట్టు ఎక్కనున్నట్లు తెలుస్తోంది. 'అమరన్' సినిమా వార్ యాక్షన్ నేపథ్యంలో ఉండడంతో ఈ కథలో యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయని భావిస్తున్నారు. దర్శకుడు రాజ్‌కుమార్ పేరియసామి ఈ చిత్రంలో శివకార్తికేయన్‌ని పూర్తి భిన్నమైన రోల్‌లో ప్రజెంట్ చేశారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలను నిజం చేసుకునేలా ఈ చిత్రం తెరకెక్కినట్లు తెలుస్తోంది. మొత్తానికి, 'అమరన్' విడుదలకు ముందు నుంచే బుక్ మై షోలో సాధించిన ప్రీ-సేల్స్ ఈ సినిమా రేంజ్‌ను, శివకార్తికేయన్‌కు ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. రేపటి విడుదలతో 'అమరన్' బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్ హిట్ అవుతుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అభిమాని హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్‌కు మధ్యంతర బెయిల్



అభిమాని రేణుకాస్వామి హత్యకేసులో జైలుకెళ్లిన కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు కర్ణాటక హైకోర్టు బుధవారం ఆరువారాల మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. సర్జరీ కోసం బెయిలు కావాలంటూ దర్శన్ పెట్టుకున్న పిటిషన్‌పై నిన్ననే వాదనలు ముగిశాయి. తీర్పును నేటికి రిజర్వు చేసిన జస్టిస్ ఎస్ విశ్వజిత్ శెట్టి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం తాజాగా మధ్యంతర బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అభిమాని హత్య కేసులో జూన్ 11న దర్శన్ అరెస్టయ్యాడు.సహనటి పవిత్రగౌడకు రేణుకాస్వామి అసభ్యకర సందేశాలు పంపడంతో ఆగ్రహించిన దర్శన్ అతడిని చిత్రహింసలు పెట్టి హత్య చేసినట్టు ఆరోపణలున్నాయి. కలవాలని పిలిపించి దారుణంగా హత్యచేసినట్టు పోలీసులు తెలిపారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి షాక్, గాయాల కారణంగా రక్తస్రావంతో మరణించినట్టు పోస్టుమార్టం రిపోర్టులో తేలింది. ఈ కేసులో పవిత్రగౌడ ప్రధాన ముద్దాయిగా ఉన్నారు.